# క్షమాపణ

నా తల్లిదండ్రులు నేఁటి యాచారము చొప్పున నాకు ఇంగ్లీషు చెప్పించిరి. నేను బి.ఏ. ప్యాసయితిని.

నాప్రకృతి పూర్వాచారములందే ప్రతిష్ఠితమయి యున్నది. నేను మున్మొదట పూర్వాచారపరాయణలలో అచ్చాడీని.

నాకథను నేనే చెప్పుకొనుచుండుటచే ప్రాచీనాచారముల నతిక్రమింపవలసి వచ్చుచున్నది. నేను క్రమక్రమముగా ప్రాచీనాచారముల నతిక్రమింపనే అతిక్రమించితిని గాన ప్రకృతము నాభర్త నామధేయమును విన్నవింప లజ్జింపను. ఇపుడానామమే నాకు మంత్రము.

నరోత్తమరెడ్డి బి.ఏ. సర్టిఫికెట్ పుచ్చికొని నాలుగేండ్లయినది. నాకు బి.ఏ. సర్టిఫికెట్ పుట్టినతోడనే నన్నతనికిచ్చి పెండ్లిచేయుటకును సర్టిఫికెట్ పుట్టినది. పరీక్షా ఫలము తేలినపిదపనే ఏయావయు లేని యానంద మనుభవింప నర్హమని నాతలంపు. నరోత్తమరెడ్డి సంకల్పముకూడ నదియే.

నవీనాచార ప్రకారము పెండ్లి జరుగవలయునని వరుని యిచ్ఛ. ప్రాచీనాచార ప్రకారమే జరుగవలయునని నా యిచ్ఛ. తుదకు నా పట్టుదలయే నెఱవేఱెను. కాని కొన్ని ప్రాచీనాచారముల నేనతిక్రమింపకుండలేక పోతిని. అసలు నాది ప్రౌఢావివాహము కదా! నేను బంతులాడలేదు. అతని కంచమున కూడు కుడువలేదు. నామగని పేరు - పాప మతఁడు చాల కుతూహలపడియుండు ననుకొందును - అపుడు చెప్పలేదు. కాని నా పేరు చెప్పింపవలసినదని నేను చేసిన ప్రేరణ మింతింతకాదు. అతఁడు విధిలేక నాపేరు చెప్పుచుండఁగా పురుషలోకమును దాసలోకముగాఁ జేసినంత యానందించితి.

పెండ్లి కెక్కువవ్యయము కాఁగూడదని అతని తలఁపు కాని నాపట్టుచే మాజమీందారు కుటుంబములలోనగు వ్యయము, ఆడంబరము, లాంఛనములు వృథాయును అయిపోయినవి.

పెండ్లియగు పిదప నేను మగనితో అత్తింటి కేఁగితిని. నేను లోఁగడ వలచి యెఱుఁగను. నరోత్తమరెడ్డికి నాపై ప్రేమ కలదని యెఱుఁగుదును గాని నన్నంతగా

అతఁడు వలపించిన నమ్మకము లేదు. చాలకాలము దాఁటినతరువాత తన యనుగ్రహమున నేను సాత్వికమగు ప్రేమ గంధమున ఓనమాలు చదువ మొదలిడితిని. నేనంతఃపురముననే యుండఁగోరితిని గాని అది నా మగని కిష్టము కాదు. నా కపుడుపుడు పురుషులకు వలె స్వేచ్ఛాచారముపై మనసు పుట్టెడిది. కాని దాని నడఁచి తెరచాటున బొమ్మవలె తిరుగుదానను. 'పిఱికివారును, అనాథలును తెరచాటున దాఁగియుందు'రని నాభర్త యనెను. 'నీవు నామనఃకవాటముపై ఆఘాతము కలుగఁజేసితి' వంటిని. 'మనః కవాటమునకు బీగము తీయుటమాత్రమే నాపనికాదు. కవాటోత్పాటనమే నాపని' అని అతఁడనెను.

నా భర్త నా యుడుపువలెను, నా యూర్పువలెను నన్నంటుకొని, నాలో లీనుఁడై యుండవలయునని నా కోరిక. నే నుండఁగా నతనికి శయ్యయేల? అతఁడు నన్నొక చెలివలె చూచుచుండువాఁడు గాని భార్యవలె చూడఁడని నా యపవాదము. రేయుంబవళ్లు నన్నంటుకొనియుండుమని అతనితోఁజెప్ప సంశయించుచుండుదానను గాని యీతఁడు వెళ్లునపు డతని వస్త్రాంచలము నెఱుఁగనటులు గ్రహించుటయో, ఏదోపని యున్నట్లు వెనుకకుఁబిలిచి యేమి లేదు లెండని యనుటయో చేసెడి దానను. అతఁడు వెనుదిరిగి చూడక, మాఱు మాటాడక వెళ్లిపోయినపిదప నేనున్సురని చిబుకముక్రింద చేయూఁది కూర్చుండుడానను. ప్రేమయనిన వట్టి రాకపోకలా? నే నపుడు చేసిన మంచి పని యేదనఁగా, ఏ దాసిచేతను నాభర్తకు ప్రేమబోధ చేయింపలేదు.

నే ననేక గ్రంథములు చదివితిని. ఏ కవియు ప్రేమను సంపూర్ణముగా నిరూపించినటులు నాకు తుష్టికలుగలేదు. ప్రేమన్న కేవల నాయికానాయకవర్ణనమా? దాని ననుభవింపవలయు, వ్రాయవలయు, నేనే కవయిత్రినయితినేని శృంగార కవిత్వమునకు జగతిలో లోపముండకుండెడిది. ఈశ్వరుఁడు దాతను ధనికుని కావింపనటులే చేయవలసినవానిని కవులుగాఁ జేయఁడు.

నా భర్తలో మఱియొక మనుష్యుఁడు లేఁడు. ఇది చెప్పవచ్చును, ఇది చెప్పరాదు అనునదతఁ డెఱుఁగఁడు. ఏ దాసియేని తనపై భావము చూపించుచో వెంటనే నాకు తెలిపి దానిని పవిత్రపఱుపు మని నొడివెడు వాఁడు. నేను దానిని తన్ని తగిలివేయ నెంచుదానను. అతఁడది ఖండితల పని యనియు, వారి నచటనే యుంచి వస్త్రగాళితము చేయుట నీతిలక్షణమనియు చెప్పి, వారిని తాను 'అమ్మా' యని సంబోధించువాఁడు. ఇటులగుటజేసి నేనొక మనశ్శుద్ధిసంఘమున కాధిపత్యము వహింప వలసి వచ్చినది.

అతఁడు తెర తీసివేయవలసినదని నాకు మఱొకసారి బోధించెను. ప్రకృతము దానిఁ దొలఁగింపవలసినంత యక్కఱ లేదని నే నంటిని నా సమాధానమున రెండు

ప్రయోజనములున్నవి: నే నంతఃపురముననే యుండుచో అతఁడు ప్రేమోపాసకుఁడగు నను నదొకటి; నేను చెప్పనిది రెండవది.

అతఁడు స్త్రీ స్వాతంత్ర్యమును గూర్చిన గ్రంథములు బోలెఁ డిచ్చెను. పాపమిపు డెవరి స్వాతంత్ర్యము పెచ్చో అతఁడెఱుఁగఁడు. అతఁడాపుస్తకముల నెచట నుంచెనో అవి యచటనే యుండెను. అవి జడములు కావా? ఆ సరస్వతి యెచట నలిగిపోవునో యని నేను కడుశ్రద్ధతో ముట్టక మూచూడక శరన్నవరాత్రపూజ చేసితిని.

నా యుదాసీనతకు నా భర్త కోపింపను లేదు, సంతసింపనులేదు; ఆ గ్రంథముల నుండి కదిలింపనులేదు. చదివితివాయని యడుగనులేదు.

మా దివాణమున తంబళి యొకఁడు దైనందినమును రుద్రపాదములు శిరమున నుంచు నాచారము కలదు. నేను వానిభార్యను అందులకేర్పాటు గావింపుమని నా భర్తకు తెలియఁబఱిచితిని. నాఁటినుండియు రాణివాసమున మగవానిదర్శనము మటుమాయ మైనది. ఆ రేయి నాభర్త ఒక చిఱునవ్వు నవ్వెను. ఆ చిఱునగవున అన్ని యర్థము లున్నవని అపుడు నాకు గోచరము కాలేదు. నా మనఃపరిణామమతనికిఁ తెలిసినటులు నాకును తెలియలేదు.

నాకడ కాతఁ డెంత రావలయునని – కాదు: ఒడళ్లు సాగిపోవునటులు కౌఁగిలిఁ గొని నాశరీరమున నతని శరీర మెంత కలిసిపోవలయునని నేను తలంచుచుంటినో, అతఁ డంత విడివిడిగనే యున్నాఁడని నాభావన. నేనెంత ప్రేమగుహలోఁ దూఱుచుంటినో ఆతఁ డంత ప్రేమ శృంగమెక్కుచున్నాఁడు.

నా కిపు డొక గర్వముదయించినది. నేనును అతనితోపాటు బి.ఏ. కడతేఱితిని. సంపత్సమృద్ధులలో తక్కువ లేదు. సౌందర్యమున నేనే పెచ్చు. నాయెడ నీతనికీ యుదాసీనత యేల? అని. నే నిటులు తలపోసికొనుచు ఆ వసంతచంద్రికలో ఉద్యానమున తిరుగుచుంటిని. నాశిరోఽలంకృతములగు పూవులు పరివేషమువలె నుండెను. మావిపొదలో కోయిల కుహూకుహూకుహూ మనెను. ఆ కుహూధ్వనికి నా చెవులు గింగురుమని పోయెను. నా శరీరమును నే మఱచితిని.

నే నతిప్రయత్నముచే మల్లెతీవల చాళ్లు దాఁటి అశోకముక్రిందికి వచ్చుచుంటిని. దాపున నున్న శిలావేదికపైఁ గూరుచుండి నా భర్త యెవరినో ధ్యానించుచున్నాఁడు. 'ఆహా, నన్నే ధ్యానించుచున్నాఁడు. ఎంత యదృష్టవతిని' అని యనుకొంటిని. పరమేశ్వరునికై తపించు పార్వతివలె నే నతని యెదుట తలవంచుకొని పుష్పాంజలి తొణుకులాడ నిలిచితిని. నేను వసంతుని కుమారివలె వలచుచుంటిని. మలయమారుతహృదయమువలె

నిట్టూర్చుచుంటిని. అతఁడు కాసంత కన్ను తెఱవకయే మనసిజు ననంగుని గావించెను. ఇస్సీ నాఁబ్రదు కనిపించినది. అతఁడు నా ప్రేమను వెక్కిరించినటులు లేదా?

నేను పులుకుపులుకున నతని జూచుచు పరిక్రమించితిని. నిక్కముగా నాకు తలనొప్పిలేదు కాని – నన్నతఁడు పలుకరింపనైన పలుకరింపఁగూడదా? – పలుకరింప నందులకు తలనొప్పికలిగినమాట నిక్కము. నాకు జ్వరమే వచ్చినది. వట్టిది వట్టిదని విలపించితిని. ఉన్న మాట చెప్పుటకేమి? ఈ దిక్కుమాలిన మగని నాకేల కూర్చితి రని నా తలిదండ్రుల దూఱితిని.

కొంతవడికి నా భర్త వచ్చి మంచముపైఁ గూర్చుండెను. కొంత నా తలనొప్పి జ్వరము శాంతించెను. ఇఁకఁ గొంచెముసేపు కూర్చుండినచో నా బాధ అపుడు తీసివేసినటులు పోయెడిదే! ఆ వైద్య మతనికెవరు చెప్పుదురు? అతఁడు నా తలయంపిపై చేయి వైచి 'యేమి యిది?' 'చల్లగను వేఁడిగను ఉన్న దే' యనెను. నేను 'ఇది వ్యామిశ్రమగు జబ్బు' అని యంటిని. అతఁడు తలనూఁచి వైద్యురాలిని బిలిచి మెల్లగా నిష్క్రమించెను.

రెణ్ణాళ్ల కొకతూరి యీ రోగము నాకు రాఁదొడఁగెను. క్రమముగా దైనందినమును రాఁదొడఁగెను. దానితో నా శరీరము కాంతి దొఱఁగుటకు బదులు కాంతి యినుమడింపఁ జొచ్చెను.

## 2

నా భర్తకు దూరజ్ఞాతియు, అదూరమిత్రుఁడు నగు ధర్మారెడ్డి రెడ్లలో బ్రాహ్మణుఁడు. అతఁడు నా భర్తకు సహాధ్యాయుఁడు. ధర్మారెడ్డి విద్యకొఱకే విద్య నభ్యసించెను. అతఁడు నా భర్తను జూడవచ్చెను.

ఒకనాఁడు పదిగంటల సుమారున నా భర్తయు, నతఁడును ప్రసంగించు చుండఁగా తెరచాటున నుండి వింటిని. నా భర్తకు అన్ని శాస్త్రములు వచ్చియుండునని నే ననుకొనలేదు. చదవులో నేనతనికి తీసిపోను అను నాగర్వము చదికిలఁబడిపోయినది. అతని సంభాషణమున తర్కము, వైశేషికము, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస, తంత్రశాస్త్రము, వైద్యశాస్త్రము, ఆస్ట్రేయాలజీ, ఫైలాలజీ, జియాలజీ, బయాలజీ, థియాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్సు, కొరాను, బైబిలు, జెందవెస్తా, ఋక్కు ఉపనిషత్తులు లోనగునవి సులువుగా ఉపబృంహితములగు చుండెను. ధర్మారెడ్డియు అతనికి తీసిపోవలేదు.

ధర్మారెడ్డి సంభాషణము మారుత శీతలమయిన కార్తికచంద్రికాసారమువలె నుండెను. నా కాతని యాకారముచూడవలయునని కోరిక యుబికినది. వెంటనే కొంచెము తెర యెత్తితిని. మఱల తెర వాల్పవలయునని నాకు తోఁపలేదు. కొంతవడికి వెదురుపొదల

గాలి కా తెర కదలఁగా తెర వైచి లోని కేఁగితిని. కాని నే నెంతయో సే పంతిపురిలో నుండఁజాలక పోయితిని. మఱల తెరవద్దనే యిల్లు కట్టుకొని కూరుచుండి యపాంగశుక్తిచే నతనిని గ్రోలితిని.

ఆ తెర నాకొక యినుపగోడవలె నుండెను. నా నిశిత నిరీక్షణములు కుశాగ్రముల వలె పడుగు పేకలను భేదించుకొని యావలికి దూఁటుచున్నవి. అపటీక్షేపముగానే నారంగమును బ్రవేశింపఁ దలఁచితిఁగాని నిర్వహింపలేకపోయితిని. నరోత్తమరెడ్డి 'తెర' తొలఁగింప వలసినదని చేసిన యుపకారమును వినియోగించు కొనలేకపోయితిని గదా యని నన్ను నిలువల్లె నిందించుకొంటిని.

మాటలాడుచు మాటలాడుచు ధర్మా రెడ్డి ఎక్కడ అలసిపోవునో యని అనుకొంటిని. అతనిచేతులు నా చేతులకంటె మృదువుగా నున్నవి. అతనిశరీరములో ఆ ముఖము రాజు! ఆ కన్ను లెవరి నాకర్షింపవు? ఆహాహా! ధర్మారెడ్డి అఁదుది. అఁదుదానికిఁగూడ అంత సౌందర్య మెక్కడిది? ఆ సౌందర్యదేవతకు నే నారతి పట్టితిని. వెనుకతలుపు లన్నియు మూసి ఆ తెరచాటునఁ గూరుచుండి అతని సౌందర్యమును పూర్ణిమా దృగ్యోగముచే ప్రత్యక్షము చేసికొంటిని.

కొంతసేపటి కంతఃప్రవేశసూచకమగు నొకగంటను నాభర్త మోరయించెను. నా యోగము ఆ శబ్దముచే భగ్నమయినది. నేను వెంటనే లోని కేఁగి మఱల గంటను మోరయించితిని. ధర్మారెడ్డి హస్తమును గ్రహించి నరోత్తమరెడ్డి నాకడ కరుదెంచెను. నా సంఘాతమంతయు నొక ప్రేమకుసుమముగా మాఱిపోవ నేను ధర్మారెడ్డి హస్తమును కదిలించుట యను మిషచే ఆ కుసుమము నతనికి సమర్పించితిని. నా భర్త యతనిని నివేదించి నా కప్పగించెను. నేను నతనితో పరిచితి కలిగించుకొంటిని. తరువాత నేను నేనేనా అని యనుకొంటిని.

మా పరిచయాధిక్యమే తెరను చించివైచినది. అందులకు ధర్మారెడ్డిని నా భర్త మిగుల నుతించుకొని యుండును. అపుడపుడు నేనును, ధర్మారెడ్డియు స్త్రీ స్వాతంత్ర్యమును గుఱించియు, ప్రేమను గుఱించియు, సోక్రటీస్ సౌందర్యమును గుఱించియు మాటలాడు కొనుచుండువారము. అపుడు నేను నా భర్త యొసఁగిన స్త్రీ స్వాతంత్ర్యమును తెలుపు గ్రంథములన్నిటిని జదివితిని. అపుడు నరోత్తమరెడ్డి ఆ గ్రంథములఁ దనకిమ్మని నా యాసక్తిని వృద్ధిపొందించెను. తన్మూలమున నా హృదయమునుగూడ కనిపట్టి యుండును.

ధర్మారెడ్డి నాతోఁ బ్రసంగింప నెంచి నపుడే నే నతనితోఁ బ్రసంగింప దొరకొను దానను. అతఁడే నాకడ కిపుడు తఱచుగా వచ్చుచుండువాఁడు. అతఁడేకాగ్రతతో

తిలకించుచు నాతో సంభాషించుచుండునపు డెపుడును నా కిసుమంతయు నర్థము కాలేదు. అతఁడు నా పరతంత్రతను కనిపట్టియుండునని సిగ్గును, ఆనందమును గూడ పొందుచుండుదానను. నేనతని నెటులుచూచుచుంటినో అతఁడును నన్నటులే చూచుచున్నాఁడని నాతలఁపు. స్త్రీ స్వభావము పురుషునకును,బురుషస్వభావము స్త్రీకిని దెలియును.

నా భర్త ప్రాచీనాచారమునుండి నవీనాచారామునకు ఇన్ని యేండ్లకు తొలఁగింప లేని నన్ను ధర్మారెడ్డి ఒక్కనాఁటితో తొలఁగించెను. ఇపుడు డాబామీఁద వరుసగా వైచిన శయ్యలపై మొదట నేనును, నడుమ నాభర్తయు, చివర ధర్మారెడ్డియు నిదిరించుట. కొన్నాళ్లరిగిన పిదప నేను నాశయ్యను నడుమకు మార్చికొంటిని.

నా భర్తకు తలఁచుకొనినంతనే నిదురవచ్చును. అతఁడు నిద్రించెనా, మఱి తురీయ యామమునకే మేలుకనుట. నాకపుడు దర్మారెడ్డితో మాటలాడుట కెక్కడలేని మాటలు పుట్టుకొని వచ్చెడివి. తుదకు నే ననతని శయ్యపై మల్లీకుసుమములో, గులాబిపూవులో, జాదులో వెదఁజల్లుదానను. అటులు చల్లునపుడతని తాఁకుచే నాశరీర మెంత పులకితమయినదో అతని శరీరము కూడ అటులాయెనా లేదా యని నేను కనుఁగొనఁ బ్రయత్నించుదానను.

అపుడపుడు ధర్మారెడ్డియే నాకడకు వచ్చి బ్రౌనింగ్, గీతలు ఉన్నవా యనియు, మల్లియలుకాని, గులాబులుకాని ఉన్నవా? యనియు, మీఁగడగాని, ఐస్క్రీముగాని ఉన్నదా యనియు అడుగుచుండువాఁడు. అతని కోరికల నన్నిటిని నేను నా హస్తగతము కావించుకొని అతనిచే అడిగించుకొనుచుండుదానను. పాపమాతనికి మోమోటమి లేదు. పిల్లవానివలె కావలసిన ప్రతివిషయమును నన్నే అడుగుచుండెను.

మా గోష్ఠిలో ఒకనాఁడు దివ్యజీవితమును గుఱించి ప్రశ్న వచ్చెను. నరోత్తమరెడ్డి సర్వసంగపరిత్యాగమునకు వోటుచేసెను. ధర్మారెడ్డి కర్మయోగమునకు వోటిచ్చెను. నావంతు వచ్చెను. నా కావిషయమున ఇంకను రూఢియగు నభిప్రాయ ముదయింపలే దంటిని. కాని నాయంతరాత్మకు తెలియకపోదు. నేను తెలుపకున్నను నావోటు దేనికి పడునో మీరు సులభముగనే గ్రహింపఁగలరు.

కొన్నాళ్లు కడఁచిన పిదప నొకనాఁడు ధర్మారెడ్డి నాకడకు వచ్చి, 'మీ కొక ఆతంకమును, నాకొక మంగళమును ఒకసారియే తొలఁగిపోవుచున్న' వనెను. 'కాదు కాదు, నా జీవరసము పోవుచున్న' దని నే నంటిని. నే నపుడు తెల్లపోయితినో, పాలియే పోయితినో! నాశరీర గృహమునుండి బయటికి వచ్చి నేను ధర్మారెడ్డిని నిరీక్షించితిని.

ఆహా! ఎడఁబాటు లో ఎంత మనశ్శోషణము కలదు! బదులునకు బదులుగాక కేవలముగా మీరు మా గృహమలంకరింప వలయునని ధర్మారెడ్డి యనెను. నేను 'తప్పక' అంటిని.

ధర్మారెడ్డి మోటారు ఎక్కెను. అతఁడు నామనస్సుతో పాటు కానిపింపకుండఁ బోయెను. అపుడు నామన స్సంతయు నాటకము చూచి వచ్చిన తరువాత ఉన్నటు లుండెను. మా మేడ యంతయు చిన్నఁ బోయినది. పోవుచు ధర్మారెడ్డి నన్నుఁ జూచిన చూపే నాకు పాథేయమైనది.

## 3

నా బయటితెర ఉహ్హాని పోయినది. కాని నా మనస్సుపై దట్టముగా పడినది. వెన్నెల, సెలయేళ్లు, ఉద్యానములు, తీవలు, పూవులు, మలయవాయువులు, ఋతువులు, హంసలు, నెమళ్లు, కోయిలలు, తుమ్మెదలు, జలయంత్రశాలలు, అంగరాగములు, శయ్యలు పుటము పెట్టఁగా, శరీరపు మూసలోనామానసము తుకతుక ఉడికిపోయెను. అపూర్వమైన కాంతి మండలము నా ప్రత్యవయవమును గుడికట్టెను. కపోలవిన్యస్తనైన నన్నపుడు ధర్మారెడ్డి చూచినఁ జాలును. సరోత్తమరెడ్డి చూడకున్నఁ జాలును.

అంచుమట్టముగా తేనెవోసి రేకులు కుట్టివైచిన పూవువలె నే నపుడుంటిని. ఈశ్వరుఁడు నన్నొక సుఖపిపాస కాలవాలము కావించెను. నాలోనేనే దహించుకొని పోయితిని. నాకీజగతి యంతయు నిస్సారముగా తోఁచెను. ధర్మారెడ్డి చిత్తరువేని లేనియెడల నామేడ చవుటి దిబ్బగా నుండెడిది. ఒకరేయి యంతయు నే నాచిత్తరువు నెదుట నుంచుకొని కూరుచుంటిని. కొంతసేపు దానితో వినోదించితిని. క్రమక్రమముగా నాకనులవెంట భాష్పములు స్రవించినవి. తెలవారులటులే కూరుచుంటిని. అపుడు మయూరము లొకటొకటియే లేచి స్తంభమెక్కి కూయఁదొడఁగెను.

నే నొకమోసము చేసితిని. ధర్మారెడ్డి శయ్యలోని యుపధానము నాశయ్యలోనికిని, నా శయ్యలోని యుపధానమును దర్మారెడ్డి శయ్యలోనికిని మార్చితిని. ప్రకృతము నేనా యుపధానమునే ధర్మారెడ్డి భుజముగా భావించి కనులు మూసికొంటిని. తల్లివలె వచ్చి నిదుర నన్నెత్తుకొని పోయెను.

నేను స్వప్నమున ధర్మారెడ్డికొక ఉత్తరమును వ్రాసితిని. వ్రాఁత కుపకరణము కలము కాదు; వ్రాఁత కుపయోగించినది కాకితమును కాదు. ఇచ్చ నా మానసము మీఁద నన్ను కరఁగించి కరఁగించి కరకకాయ సిరాచేసి అక్షరములుగా పోసినది. అపుడు ధర్మారెడ్డి నాలో ఒకభాగముగా ఉండెనుగాన దానిని పఠించెను. నే నతనిలో ఒక భాగముగా నుంటిని. నాలో నున్నవాఁ డెవఁడో నన్ను పట్టుకొని యీ సుఖధామమున కెక్కించుచు హఠాత్తు జాఱవిడువ నేను జాగ్రదవస్థలో పడిపోయితిని.

ఇఁక నీ జన్మము సార్థకమని నాకు హజము కలిగినది. నావలెనే అతఁడును నా దిండుపైఁ బరుండి వినోదించుచుండునని నిశ్చయించితిని. అపుడు నీ వెవరికిని నివేదింపరాని ఒకానొక తన్మయతలో మ్రగ్గుచుండలేదా? అని నేను ధర్మారెడ్డికి లేఖ వ్రాయకుండుట చాలవిచిత్రమే.

ఎవని పొదయనిన నాకుఁగిట్టకున్నదో ఆ నరోత్తమరెడ్డి ఆ రేయి నాకడకు వచ్చెను. అతఁడు నన్ను నా పేరుపెట్టి పిలిచెను. అతఁడేపేరున నన్నుఁ బిలిచెనో ఆ నాపేరు స్త్రీలలో చాలమంది కుండవచ్చును. నాపేరు తెలుపుచో మీ పేరులన్నియు కలుషితమై పోవును. మీరెవరును ఇఁక ఆ పేరు పెట్టుకొనఁజాలరు. కావున 'పేరులో ఏమున్నది?' అని అనకుఁడు.

అతఁడటులు పిలవఁగా నేను పలుకనైనఁబలుకలేదు. పిదప నతడు – 'కొన్ని జంతువులు తమజీర్ణకోశమును విప్పి నీటిలో కడిగి కొనును. నీవును నీమనస్సు నటుల చేసికొనుము' అనెను.

నా గుండియలు జలదరించెను. పట్టుపడిన దొంగవలె నేను మాటలాడలేక పోయితిని. అతఁడు నా వాలక మాఁచిచూచుచు కూరుచుండెను. నామానస మంతయు అతని నేత్రదర్పణమున ప్రతిబింబించినటులు నాకు భయము పుట్టెను. ఏ కవియు ఆ యవస్థను వ్రాయవలదు. సవతులేని ఆ యవస్థను భరింపవలదు. దానిని భరించినదానను నేనే.

అతఁడు క్రమ్మఱ నిటు లనియెను : చావఁబోవుముందు చేసికొను జీవప్రాయశ్చిత్త మొక జీవప్రాయశ్చిత్తము కాదు. మానసము మీరినపుడు చేసికొన్న ప్రాయశ్చిత్తయే ప్రాయశ్చిత్తి. మృతికాలమునఁ జేసి కొన్నది జీవునితో పాటు మరణించును. సజీవుఁడై చేసికొన్నది సజీవమై యుండును.

నామనస్సుపై శరీరచ్ఛాదనము లేదా యని ఒకసారి కనులతోఁ జూచి కొంటిని. నా మానసములోని ఒక్కొక్క పెట్టెయు పైకి లాఁగి తెరచుచున్నటు లుండెను. ఇంక నితఁడెంత ద్రష్టయో యని తెలిసికొనఁ గోరినటులు తల వంచుకొని కూరుచుంటిని.

అతఁడు క్రమ్మఱ "మనస్సు కన్న మంచి గురు వెచటను లేఁడు; మానసమున అజయ్యమైన వృత్తి కలుగుట అనఁగా ఈశ్వరుని దాపునకుఁ జనుట, లేక తనను తాను ప్రేమించుట. అపు డెవఁడును దానిని ఇతరులకుఁ దెలుపఁజాలఁడు. ఇఁక నిన్ను నేను పరిత్యజించుచున్నాను. ఈ పరిత్యాగము నీ మేలుకొరకే కావున ఇది పవిత్ర పరిత్యాగము; ప్రేమ గర్భిత పరిత్యాగము. నీవు నిన్నతిగా ప్రేమించుకొని వత్తువేని యీ నీ మిత్రుఁ డెపుడేని నీ పార్శ్వవర్తియే' అని గంభీరముగాఁ బలికి నన్నాఁచి చూచుచు నిలువఁబడెను.

నా కనులవెంట నీరు క్రమ్మ నారంభించెను. నా కంఠము స్తంభింపకముందే 'రాతికి చెవులు లేకుండుట యెంత పుణ్యము? మోడునకు చేతన లేకుండుట యెంతభాగ్యము?' అని నేను కనులు మూసికొని పఱపుపై నొఱగితిని. అతఁడచటినుండి మెల్లగా వెళ్లుట కనులవలె నా చెవులు చూచెను.

అటు లాతఁడు నిష్క్రమించిన కొంతసేపటికి లేచి కూర్చుంటిని. లతికా వర్ణవిచాలనముచే పుట్టి, పర్వతవృక్షశాఖాఘాతముచే పెరిఁగి, ఒకమహావాతము వీవఁ దొడఁగెను. ఉపవనమున రాలిన కుసుమములు ఆకాశ పతితములగు తారకాగణములవలె నుండెను. ఆ వాత్యాచంక్రమణములందు ఎగిరిపోయిన జీర్ణలతాజాలములు క్రిందికిని మీఁదికిని దిగు గాలిపడగలవలె చూపట్టెను. అవి మీఁదికేఁగినవో, క్రిందనే పడినవో ఎవరెఱుఁగుదురు? చాలసేపటి కాయాకాశరంగమున మబ్బు తెరలు విరిసినవి. ఈ నాటక మెవరాడించిరో యెవరు కనుఁగొనినారు? కాని అందఱును కనులుపెట్టుకొని చూచినారు.

నా కపుడు నరోత్తమరెడ్డియందొక గౌరవము, ఒక నైచ్యము, ఒక అస్తిక్యము-ఒకనాస్తిక్యము, ఒకప్రేమ, ఒకత్యాగమును కలిగెను. కడపటి నిమిషమున నేనతనిని సంపూర్ణముగా సన్న్యసించితిని.

'నీపరిత్యాగము నాకొక అర్హత నిచ్చినది. ఆయర్హతతోడనే నేను నీనుండి కత్తితో నఱకఁబడిన తుండెమువలె వేఱయిపోవుచున్నాను. నీ మాటలు నీహృదయము నుండియే ప్రసరించెనేని నన్ను ద్వేషింపఁజాలవు' అని యొక యుత్తరము నరోత్తమరెడ్డికి వ్రాసి యెవ్వరికిఁ దెలియకుండనే నటనుండి యెగిరిపోయితిని.

ఆహా! ఆ ప్రథమస్వాతంత్ర్యము నేమని చెప్పుదును? అది కాఫీహోటలు విందు; ఆఱవయింద్రియసుఖము; ఉన్మత్త తాండవము; మూఁడవచూపు; గర్భనరకము; విదేహముక్తి.

నాకు ప్రతిపదార్థము భయమయము గాను, ప్రేమమయముగాను కానిపించెను. నాకొఱకే ఋతువులు, కుసుమములు, చంద్రుఁడు, దక్షిణ వాయువులు సృజింపఁబడినవి.

నాకొక క్రొత్తవన్నె వచ్చినది. స్వేచ్ఛ నా సౌందర్యమును పల్లవింపఁజేసినది. నేనా స్వేచ్ఛలో ముక్తునివలె బంధ మనుభవించితిని; బద్ధునివలె ముక్తత చవి చూచితిని. అప్పటి నాకర్మయంతయు ఒకతపస్సు. నేనా తపస్సు నంతయు ధర్మారెడ్డికడనే యుండి అతనికొఱకో, నాకొఱకో చేసితిని. అతఁడును, నేనును ఏకాంత చంద్రికలలో సంచరించితిమి. పర్వతసానువులపై దీర్ఘాలోచనములతోఁ గూరుచుంటిమి. నదీతీరము లందలి కురుమాపులేని పచ్చిక పట్టుతివాచీలపై విశ్రమించితిమి. ప్రాసాదోపరిభాగము

లందు శరచ్చంద్రికాతూలశయ్యలపై మాటలాడి మాటలాడి నిదురఁగూరితిమి; ఏకపంక్తి నారగించితిమి.

నే నతనికి షెల్లీ - ఎపిప్సైకిడియన్ వినిపించితిని. విజయవిలాసము తల కెక్కించితిని. అభిజ్ఞానశాకుంతలమును నర్మసచివుని చేసితిని. ఓమర్ ఖయామును పార్శ్వచరుని కావించితిని.

ధర్మారెడ్డి దాసికలలో నొకతెయేనియు మఱియొక దాసిచెవిలో ఏరహస్యమేని చెప్పలేదు. కాని మేమిరువుర మరణ్యమునకు అసివారు వెళ్లునపుడుమాత్ర మెదురుబడిన పౌరులు మా గుఱ్ఱములు కొంతదూర మరిగిన పిదప అచట నిలిచి మమ్ము వేలితో చూపించుచు ఏవియో కొన్ని మాటలు చెప్పుకొనువారు. ఆ మాటలు వినుటకు నాకు మూఁడవ చెవిలేకపోయెనే యని నేననుకొను దానను.

ధర్మారెడ్డి కనుచాటుచేసి నరోత్తమరెడ్డి యతనికి వ్రాసిన యుత్తరములు చూచుటకు నాకు తత్తరయెత్తెడిది. వానిలో నామాటయే యుండునది కాదు. నరోత్తమరెడ్డికి చేతనలేదా? లేక దాని నతఁడు జయించెనా? అని నేను సంకోచపడితిని. అది దైవమున కెఱుక!

ఒకటి రెండు మూఁడు నాలుగు నెలలు కడఁచెను. 'నీ వెందులకు వచ్చితి' వనికాని, 'ఇంక నెన్నాళ్లుందు'వని కాని ధర్మారెడ్డి నన్నడుగ లేదు.

అతని పఱుపులో దిండు మాఱిన సంగతి అతని కింతవట్టు తెలియలేదు. నేను తడవతడవకు ఆ తలయంపి పైకెత్తి క్రింద వైచి ఆకాశమున బంతియాట లాడినను అతఁడు దాని విషయమున ఇసుకంతయేని శ్రద్ధ చూపలేదు. నేను మాత్ర 'మీదిండు నీది కాదా?' అని అడుగలేదు.

అతఁడు లేనపుడు నే నతని శయ్యపైఁ బరుండుదానను. అతఁడు వచ్చి నాశయనమునఁ బరుండు వాఁడు. నే నతని వెండికంచమున నా వ్యంజనమును బడవైచుదానను. ఆతఁడు స్వీకరించువాఁడు. అతఁడు నాకు Friendship Mystic అనిపేరిడెను. Love and Beauty Mystic అనిపేరు పెట్టినచో సరిగానుండెడిది.

నా కాతని చేఁతలన్నియు ఒక శక్తిని చేకూర్చెను. ఎట్టిశక్తి? నా చరిత్రము నొక తూరి సింహావలోకనము చేసికొనునట్టిది. చేసి కొంటిని సరియ. ఏమి ప్రయోజనము? ఆ శక్తి నిశ్శక్త మైపోయినది.

వెతలఁ బొగులువారు శాంతికని ఏకాంతములు చేరి లేనిపోని వెతలన్నియు నెత్తిని వైచికొందురు. అటులే నేనును ఉద్యానమునకుఁ బోయితిని. నాకెచటలేని దుఃఖమును పుట్టుకొనివచ్చెను. నేనెవరిని కోరిన వారు నన్నెత్తుకొనిపోవరు? అపుడు నన్నెందఱు

హృదయేశ్వరిగా భావించి వూలఁబూజించిరో! నన్నెదుర్కొనిన ఏ పురుషుఁడు ఇంద్రియములు లేని చేతనుఁడు కాలేదు? ధర్మారెడ్డి నా సాహచర్య సహవాస సహభోజన సహశయనములు స్త్రీ వలెనే ఆచరించుట యేమివింత? నా సౌందర్యము గుడ్డిగవ్వకంటె ఏమి ఎక్కువ? ఈ సౌందర్యముకంటె అంతరసౌందర్యమేమేని కలదా? ఉండుచో అది యెవరిలో లేదు? లోపలినుండి పుట్టుకొని రావలయునుగాని నన్నుఁ బ్రేమింపుమన్న నెవరు ప్రేమింతురు? ప్రేమపుట్టుచో గ్రుడ్డిదియేని అర్ధాంగి. ప్రేమ లేదని రంభ యేని అమ్మ. ప్రేమ గుడ్డిదా, మనుజులు గ్రుడ్డివారా?

శేఫాలికాకుసుమములు పైఁబడ్డ తల బరువెక్కెను. యూధికలు నన్నుఁ జూచి నవ్వెను. ఏడాకుల యరఁటిపువ్పొదులు నా తలపై కాలువెట్టెను. వీనియన్నింటిపై అపరిణత శరచ్చంద్రచంద్రిక! నేనా యాటకొలంకునొద్దన కూరుచుంటిని. ఊరక నా గండఫలకముల నుండి బాష్పము స్రవించెను.

నా వెనుకనుండి వచ్చు పాదవిన్యాసధ్వనిని నా చెవులు వినలేదు. నేను వెనుదిరిగి చూచువఱకు ధర్మారెడ్డి నాపైఁ జేయివైచెను.

ఆహా! ఏమి ఆస్పర్శ! అది నాబాష్పధారలకు సేతువు, పులకములకు చక్కిలిగిలి. ప్రీతికి విటుఁడు. 'ఇఁక నేను ధన్యను. ఇఁక మృతికి భీతిల్లను. ఇఁక ఇహలోకమున స్వర్గము కట్టెదను' అని అనుకొంటిని ఆ తతక్షణము నాశరీరము నాకుఁ దెలియుచో ఒట్టు.

తనపై నొఱగిన నన్ను సరిగా నిలువరించుచున్న ధర్మారెడ్డిని కొంతవడికి కనుఁగొంటిని. అతఁడు న 'న్నమ్మా' యని సంబోధించెను. నేను పాతాళమున పడిపోయితిని. నే నచటినుండి భూలోకమునకు తిరిగి వచ్చువఱకు 'అది నీ మంచికేని దుఃఖింపుము. దుఃఖమునందలి సుఖమే సుఖము! అమ్మా! పలవింపుము' అని యతఁ డనుట వింటిని. అతని ప్రత్యక్షరమును నన్నొక అసీమమగు వెలుఁగు లోనికి నెట్టెను.

నే నతని నచట నుండుమని యనలేదు; ఆతఁ డచట నుండనులేదు. అతఁడు నిష్క్రమించినంతటనే నాకు చచ్చిన చావయిపోయినది. నాకు ప్రాణములందెంత తీపియో! నే నా కంఠదఘ్నమైన కాసారము విడిచి యీవలికి వచ్చితిని. నేను రాకున్నచో ధర్మారెడ్డి తన మృదుల హస్తములతో నెత్తుకొనివచ్చి వ్రేల్చువాఁడుగదా! అని యనుకొంటిని.

మేడమీఁదినుండి యిటులు విస్పష్టముగా వినఁబడియెను : – 'న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవ త్యాత్మన స్తు కామాయ పతిః ప్రియో భవతి। న వా అరే జాయాయై కామాయ జాయా ప్రియాభవ త్యాత్మ నస్తు కామాయ జాయా ప్రియాభవతి!

నవా అరే పుత్రాణాం కామాయ పుత్రాః ప్రియా భవ న్త్యాత్మన స్తు కామాయ పుత్రాః ప్రియ భవన్తి। నవా అరే విత్తస్య కామాయ విత్తం ప్రియం భవ త్యాత్మనస్తు కామాయ విత్తంప్రియం భవతి..... నవా అరే లోకానాం కామాయ లోకాః ప్రియా భవన్త్యాత్మనస్తు కామాయ లోకాః ప్రియా భవన్తి.'

నేనిటులు విని కొంతవడికి మేడపై కేఁగితిని. ధర్మారెడ్డి నిదురించెను. అతఁ డచట తెలచియుంచిన బృహదారణ్యకమున 'మగని కొఱకు మగఁడు ప్రియుఁడు కాఁడు, తనకొఱకు మగఁడు ప్రియుఁడు. ఆలికొఱ కాలు ప్రియురాలు కాదు, తన కొఱకే ఆలు ప్రియురాలు. కొమరులకొఱకు కొమరులు ప్రియులు కారు. తనకొఱకే కొమరులు ప్రియులు. రొక్కము కొఱకు రొక్కము ప్రియము కాదు, తనకొఱకే రొక్కము ప్రియము... లోకులకొఱకు లోకులు ప్రియులు కారు. తనకొఱకే లోకులు ప్రియులు అనునర్థమును ఇంగ్లీషు వ్యాఖ్యచే గ్రహించితిని.

నాకొరకే నేను వచ్చితినని తెలిసినది. నరోత్తమరెడ్డి యిందులకనియే నన్ను పరిత్యజించెను. నా శరీరమంతయు పిండీకృతవస్త్రమాయెను. తెలవారులు అభావ మనుభవముచేసి కొంటిని. ఆహా! అది యెంతసత్యము! క్రమక్రమముగా ఆ పిండీకృత వస్త్రముయొక్క ఒక్కొక్క చుట్ట విప్పారినది. నే నెవరు? అని నే ప్రశ్నించుకొంటిని.

తెలవారుకడ ధర్మారెడ్డిని తిలకించితిని. ఆహా! అతఁడు· నాజీవితమును పవిత్రపఱిచిన పరమగురువు! నేనతని లేపి 'నాయనా! నేనొక పొరపాటుచేసితిని: నా తలాఁపి నీశయ్యకును నీ తలాఁపి నాశయ్యకును మార్చితిని. ఇపు డామార్పు సవరింపవలయు' నంటిని. ధర్మారెడ్డి చిఱునగవుతో తన తలాఁపి తీసికొని నా తలాఁపి నా కిచ్చెను.

ధర్మారెడ్డికడ సెలవు గైకొని పయనమైతిని. ఆ పయన మత్తింటికని, పుట్టినింటికని తెగక, నిశ్చితబుద్ధి కలుగువఱకు ఒక యేకాంతస్థలమున నుండ నెంచితిని.

నే నున్న యేకాంతస్థలమున నూతనమగు ఏడవ ఋతువు ప్రవేశించెను. పదమూఁ డవనెల చొచ్చెను. ఱువదొకటవసంవత్సర మారంభించెను. ఎనిమిదవవారము ఉదయించెను. పదునారవ తిథి వచ్చెను. ఆఱవ మహాభూతముతో అచటి సృష్టి. మానసముతో అచటి భోజనము. శూన్యముతో అచటిక్రీడ. బయట నెన్ని నగారాలు మ్రోఁగించినను అచటికి చొఱవు. అచట స్వయముగా శబ్దము మ్రోఁగును. అందు దోషములు మేము మేమని వచ్చి ఆహుతియగును. అందు శాంతి పసిపాప వలె జనించును.

నే నా యేకాంతమున చాలఁగాల ముండుటచే నా తలిదండ్రులు మరణించిరనియు నన్నుఁ గనుఁగొన మిగులఁ బ్రయత్నించిరనియు నే నెఱుఁగను. నే నమెరికా వెళ్లినటులు

వార్తాపత్రికలు ప్రచురించెను. నా తమ్ముడింగ్లాండులో చదువు ముగించుకొని నా కొఱకమెరికా వెళ్లి విసిగి వచ్చెనని తెలిసినది.

ఇపుడు నా తమ్ముఁడు ననుఁజూడవచ్చెను. అతఁడు భవిష్యజ్జీవితము ఎటులు కడఁప నెంచి నదివింటిని. మన మెంచినటులది చనదు. దాని కితరులకుఁ గానరాని కన్నొకటి కలదు. దాని చూపులోనే అది చనును. ఎపుడో ఆ కన్ను మూఁతపడును. నాఁటఁగోలె అది మనము చెప్పిన చొప్పున నడుచును.

అతఁడు గృహాభిముఖుఁ డాయెను. నరోత్తమరెడ్డిని సందర్శించి మఱియింటికిఁ బొమ్మని అతనికి చెప్పితిని. 'నరోత్తమరెడ్డి నీకు బావయే కాఁడు. అతఁడు నరోత్తముఁడే' యని అంటిని.

నే నిటులనఁగా అతఁడు రెండు దీర్ఘ నిశ్వాసములు విడిచెను. నేనును రెండు దీర్ఘనిశ్వాసములు విడిచితిని.

మనస్సు వాక్కుతోనే కాక ఇతరేంద్రి యముతోను మాటలాడఁ గలదు. ఆ సంభాషణ మాత్మకడకు పాదములతో పరుగిడును.

నా తమ్ముఁడు వెళ్లిన తరువాత నన్నుఁ బెంచిన దాది వచ్చినది. అది ముగ్గిన పండు. సుఖదుఃఖముల పుటపాకము. వాత్సల్యము నకు పుట్టినిల్లు. నేను ముదియలలోను, కసుఁగందులలోను జగన్నాటకమును చూడఁగలను. దాని శీలవాత్సల్యములచే నేను పసుఁబాపనైతిని. దానికి నా నగలొలిచి యిచ్చి యింటికిఁ బనిచితిని.

నేను నాయింటికిఁ బయన మయితిని. నేనే ప్రదేశము శ్మశానమువలె విసర్జించితినో అదియ నా పడకటిల్లు; అచటికే నా పయనము. నేనిపుడు నాకొఱకే నా యింటికి వెళ్లు చుంటిని. కాని బడికి వెళ్లు పిల్లవలెనే వెళ్లితిని.

అంతిపురిలో నాకు సవతి యుండదనియే నాతలంపు. కాని నాయందు నాభర్తకుఁ గల విశ్వాసమే యచట సవతిగా నుండెను. నరోత్తమరెడ్డి నాకు 'దేవిడీ మన్నా' చెప్పు ననుకొంటిని. కాని పరిచారిక లందఱు తొంటివలెనే స్వాగతమిచ్చిరి. 'అమెరికానుండి యేమి తెచ్చితి'రని అమల యడిగెను. 'ఆ దేశము మనయడుగున నున్నది కదా! అటవారందఱు తలలు క్రిందై, పాదములు మీఁదనై పడిపోవరా?' యని కుముదిని శంకించెను. 'అచట పగలు రాత్రి, రాత్రి పగలును గదా! సూర్యుఁడు చంద్రుఁడుగను, చంద్రుఁడు సూర్యుఁడగను మాఱుదురా?' యని ప్రసన్న పలికెను. 'అచట చెఱువులలోను, నదులలోను, సముద్రములోను నీరు క్రిందఁ బడిపోవక యెటులు నిలిచియుండు?' నని పద్మిని ప్రశ్నించెను. 'ఇచటి నుండి సూటిగా బెజ్జము వైచికొని పోయినచో అచటికి

తేలుదుమా?' యని యరుణ యనియెను. సామానంతయు వెనుక బండ్లమీఁద వచ్చుచున్నదని వారియూహ. నరోత్తమరెడ్డికి నా వచ్చినవార్త తెలిసియుండును.

నా యంతఃపురమున నేను స్వాధీనపఱచికొంటిని. అతఁడు నన్నటులు చేయనిచ్చు ననుకొనలేదు. నేను తొంటివలెనే నా పాకశాలలో భుజించితిని; అతఁడతని పాకశాలలో భుజించెను.

ప్రాసాదోపరిభాగమున దాసికలు మా యిరువురికిని రెండు శయ్యలు పఱచిరి. చందన తాంబూలము లునిచిరి. అగరువత్తులు వెలిఁగించిరి. గాజుపళ్లెరములలో పూవు లుంచిరి.

నన్నుఁ జూచుటకుఁబోలె తారాగణము లాకాశసౌధమున నిలువఁ దొడఁగెను. పతివ్రతాతిలకమగు నరుంధతి నన్నుఁ గన్నారఁ గనుఁగొన నిష్టము లేనిదానివలె చూచినటులు, చూడనటులు, మినుకు మినుకు మనుచుండెను.

నేను మేడమెట్లెక్కుఁ దొడఁగితిని. ఒక్కొక్క మెట్టెక్కుట ఒక్కొక్కలోక మెక్కి నటులుండెను. చివరమెట్టునెక్కి నాయవమానము నెక్కితిని. డాబామీఁద నిలవఁబడి తొల్లిటి నామీఁద నేను నిలువఁబడితిని. నరోత్తమరెడ్డి పాదములుచూచి నాగుండియల చప్పుడు వింటిని. అతని ముఖమును అవలోకించి ప్రేమను పుక్కిలించితిని. క్రమగతియు సరళ శైలియు, ఉన్నతభావముకల సద్వృత్తమువలె నే నా నరోత్తమునిదరికి నడచితిని.

దక్షిణాశ శాంతిసందేశమును వలె మలయమారుతము నంపెను. చంద్రుఁడు వెన్నెలచే సత్వాంజనము పూసెను. ఆ జ్యోత్స్న పరమేశ్వరుని సగుణస్వరూపమువలె దివ్యవిభూతులతో తేజరిల్లెను.

శయనైకాదశినాఁట పాలవెల్లిలో పురుషోత్తముఁడు పవ్వళించినటులు నరోత్తముఁడు పవ్వళించెను. నేను కాళరాత్రివలె అతనికడ కరిగి యతని రెండు పాదములును గ్రహించితిని. నరోత్తమరెడ్డి లేచి నాపేరున నన్ను సంబోధించి, 'నీకు శాంతి కలుగుఁగాక!' అని ఆశీర్వదించెను.

నేను ' ఓగురూ! పరమగురూ' అని మాటలాడఁబోఁగా, అతఁడు 'కాదు కాదు; నీవే నీకు గురువవు; నీకు బందుగుఁడవు. నీవే నీకు శత్రుఁడవు. నీవే నీ కాత్మవు' అనెను.

నేను 'నిక్కము' అని పిదప నావృత్తాంతమంతయు పూస గ్రుచ్చినటులు చెప్పికొంటిని. అతఁడు శాంతితో సమగ్రముగా అసంగుఁడై వినియెను.

పిదప నాహస్తములలో నున్న అతని పాదపంకజములు నలిగిపోవు ననుభీతి లేక యొత్తుచు 'నన్ను క్షమింపుము' అని ముమ్మారు వేఁడితిని. వేఁడి కన్నీరుచే నా చెక్కులు లేఁత మఱ్ఱాకు లాయెను.

'నిన్ను నీవే క్షమించుకొంటివి. ఇతరుఁడు క్షమించుటలో మెత్తఁదన మున్నది. తన్ను తాను క్షమించుకొనుటలోఁగల కఱకుఁదనము సూర్యునందేని లేదు. నాచే క్షమింపఁ జేసికొని క్రింది కొక మెట్టేల దిగెదవని అతఁడనెను.

'కాదు కాదు; నన్ను నేను క్షమించుకొనుటలో శాంతి లేదు. ఎంత క్షమించుకొన్నను దాని కెదురుగనే నేను క్షమింపఁబడ ననునది వలె దోషము నిలువఁబడును. నీ క్షమాపణయే దాని కుచ్చాటనము. అథవా నేను క్షమింపఁదగుదానను గాన. నాలోప మెపుడు నా కనులలో కాఁపుర ముండవలయును. నన్ను క్షమింపకుము!' అని యంటిని.

నరోత్తమరెడ్డి భాష్పజల ప్లావితుఁడై. 'నిన్నుఁగాక మఱియెవరినినేను క్షమింపఁ గలను? ముమ్మాటికి క్షమించితిని. ముమ్మాటికి క్షమించితి' ననెను.

నే నదివఱకుఁ గాదు, ఆ క్షణముననే నరోత్తమరెడ్డిని వివాహమాడినది.

నా ప్రాయశ్చితమున కుపకల్పింపఁబడిన శుద్ధిసభలో సదస్యులవలె నక్షత్రములు, చంద్రుడు, సప్తర్షులు అరుంధతి లేచి నన్నాశీర్వదించినటులుండిరి.

నరోత్తమరెడ్డి నన్ను పుత్త్రి వలె, చెలియవలె, భార్యవలె, శిష్యవలె క్షమించెను. అతఁడు వెనుకటి వలెనే సంచరించెను. ఆహా! ఏమి యా త్రాసు!

నా చరిత్ర మంతము కాకమునుపు నరోత్తముఁడు నన్ను క్షమించిన ఆ పవిత్రరాత్రిని స్మరించుకొందును.

ఘాతకుని క్షమింపవచ్చును; దొంగను క్షమింపవచ్చును; అందఱను క్షమింప వచ్చును; మతిమాఱిన భార్యను క్షమింపవచ్చునా? ఆమెను క్షమించుటయే క్షమ. నరోత్తమరె డ్డియే నేనై, నేనే నరోత్తమరెడ్డినై యున్నచో నేను క్షమింపఁజాలకపోయి యుందును. నన్నిటులు క్షమించి పుచ్చిన నరోత్తముఁడు మనుజుఁడా, దేవుఁడా, క్షమాదేవుఁడా?

నరోత్తముని క్షమాపణమే నాజీవవాణి. ఆ వాణితో నా కథను సమగ్రముగా చెప్పుకొనుటకు నేను సిగ్గిల్లను. నాచరిత్ర శరీరమునకు జీవమైన క్షమాపణ తన పూర్వదళములను రాల్చిక్రొత్తాకు తొడిగినది.

నన్నాతఁడిటులు క్షమించి తలమునుక లయిన ప్రేమతో నన్ను కౌఁగిలించుకొని నటులుండెను. ఆ యాలింగమున నేను నాశరీరమును బాసినచో ఎంత ధన్యవతిని ఏలయనిన, నూతనశరీరమే ఆ యాలింగనమునకుఁ దగినది.

● *భారతి – అక్టోబర్ – 1928* ●